## 275వ అధ్యాయం

## ٢٧٥ - بَابُ تَحْرِيمِ الطَّعْنِ فِي الأَنْسَابِ الثَّابِتَةِ فِي ظَاهِرِ الشَّرْعِ

## షరీఅత్ పరంగా రుజువైన వంశం గురించి దెప్పిపొడవటం నిషిద్ధం

قَالَ اللهُ تَعَالَى: ﴿ وَالَّذِينَ يُؤْذُونَ الْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ بِغَيْرِ مَا اكْتَسَبُوا فَقَدِ احْتَمَلُوا بُهْتَانًا وَإِثْمًا مُبِينًا ﴾ [الأحزاب: ٥٨].

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఏ తప్పూ చేయకపోయినా విశ్వాసులైన స్త్రీ పురుషులకు మనస్తాపం కలిగించేవారు ఒక పెద్ద అభాండభారాన్ని, ఒక స్పష్టమైన పాప భారాన్ని తమ తలపై మోపుకున్నట్లే."

*(అహ్‌జాబ్: 58)*

١٥٨٠ - وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «اثْنَتَانِ فِي النَّاسِ هُمَا بِهِمْ كُفْرٌ: الطَّعْنُ فِي النَّسَبِ، وَالنِّيَاحَةُ عَلَى الْمَيِّتِ» رواه مسلم.

1580. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ప్రజల్లో ఉండే రెండు విషయాలు అవిశ్వాసానికి (కుఫ్రుకు) దారితీస్తాయి. 1) వంశం గురించి దెప్పిపొడవటం 2) చనిపోయిన వారి మీద ఏడ్చి పెడబొబ్బలు పెట్టటం. *(ముస్లిం)*

*(సహీహ్ ముస్లింలోని ఈమాన్ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

పై రెండూ ఎంత పెద్ద పాపాలంటే మనిషి గనక ఉద్దేశ్యపూర్వకంగా వాటిని ధర్మ సమ్మతంగా భావించి చేస్తే అతను అవిశ్వాసి (కాఫిర్) అయిపోతాడు. ఒకవేళ మానవ సహజమైన దౌర్బల్యం మూలంగా ఆ తప్పులు జరిగిపోయినా అది ఘోరాతిఘోరంగానే పరిగణించబడుతుంది. వంశం గురించి దెప్పిపొడవటమంటే ఒకర్ని పరాభవించే, అవమానించే ఉద్దేశ్యంతో అతన్ని పట్టుకొని "మీ నాన్న ఆ పని చేస్తాడు, మీ అమ్మ ఇలాంటిది లేక నువ్వు సాలెవాడివి, కమ్మరివి, రజకుడివి, చెప్పులు కుట్టేవాడివి" అని దెప్పిపొడవటం, వృత్తిపరంగా ఏదయినా వంశాన్ని లేక వ్యక్తిని చులకనగా భావించటం కూడా వంశం గురించి దెప్పిపొడవటం క్రిందికే వస్తుంది.